ఆద్యంతాలు

[కథానిక]

●

శ్రీ క్రొవ్విడి లక్ష్మన్న

మర్నాడు తండ్రితద్దినం. ఆమాటా యీమాటా అనుకునే సందర్భంలో పార్వతిని తీసుకువస్తానన్నాడు వెంకట్రావు. పార్వతి అతని పినతండ్రి కూతురు. తండ్రిప్రసాదం తనలాగే చెల్లెలుకూడా పుచ్చుకోవా లని అతని ఆరాటం.

"ఆముండవ్వా తెత్తేవంటే గంటేస్తాను జాగర్త" అంది తల్లి.

"పోనీ అమ్మా, యీ ఒక్కరోజే కాదుటే!"

"చాల్లే నేర్చుకుపోయేవ్ పొత్తు! కాకపోయినా యిదేం పోయే కాలంరా నీకూ?"

"మళ్లీ రేపుసాయంత్రం బస్సులో పంపించేస్తానులేవే" అంటూ ప్రాధేయపడ్డాడు.

"నోరు ముయ్యి!"

అతని తండ్రే మూసేసుకున్నాడు నోరు పదహారేళ్ల క్రితం. వెంకట్రావు తాతగారు పోయిన కొత్తరోజులవి. పంపకాల విషయంలో అద్దాలబీరువాదగ్గిర వచ్చింది పేచీ. అసలుకి అది వివాదపడవలసిన విషయమే కాదు. అయినా అంతలో అల్లుకుపోయింది. పట్టుదలలు పెరిగిపోయేయి.

నిజం చెప్పవలసివొస్తే, చిన్నకోడలు ముచ్చట పడుతోందిగదా అనే ముసలాయన చేయించేడు ఆ బీరువా. తమ్ముడికి వెళ్లడమే సబబు అని వెంకట్రావు తండ్రీ అన్నాడు. అదుగో వాచ్యంగా ఆయన ఆ మాట అనడంతోనే వెంకట్రావుతల్లికి అరికాలిమంట నెత్తికి ఎక్కింది. ఇంటికి పెద్దకోడలిని, నామాట అంతా మన్నించాలి అంటూ పరవళ్లు తొక్కింది. ఆ పెద్దరికమా అని అన్నదమ్ములకి మరి చూపులు లేకుండా పోయేయి. చివరికి తమ్ముడు పోయినప్పుడు కూడా మాటవరసకి వెళ్లి పరామర్శించేడేగాని, యింకెలాగానూ అడుక్కోలేకపోయేడు వెంకట్రావునాన్నగారు. పెనిమిటి పోయిన పదోరోజు దాటకుండా మరదలూ భవబంధాన్ని బాపుకుంది. నాటినుంచీ ఆ ఒక్కగాని ఒక్క కూతురూ మాతామహుల యింట్లోనే పెరుగుతూవచ్చింది. ఆ చెల్లెల్ని చూడాలంటే నాటికీ నేటికీ సుగ్రీవాజ్ఞ వెంకట్రావుకి. అయినా అడపా దడపా తల్లికనుచాటుగా చూసివస్తూండేవాడు.

చెల్లెలు రాకుండానే, తద్దినం పెట్టుకుని మర్నాడు మెయిలులో వెళ్లిపోయేడు అతను నౌకరీలోకి. పరాయివూరు వచ్చేడు అన్నమాటే కాని మనస్సు మనస్సులో లేదు. దృష్టి అంతా చెల్లెలిమీదికే పోతోంది. వొచ్చి పదిరోజులు అయినా స్వాస్థ్యం కుదరలేదు. ఓ నాడు రివ్వున సైకిలు తొక్కుకుపోతూవుంటే ఆకాత్తుగా కంటపడింది ఆమె, కుడిచేతిలో పుస్తకాలు గుండెలమీదుగా వొంచిపట్టుకుని మరో నలుగురు పిల్లలతో కాలేజీకి వెళుతూను. ఇద్దరూ గతుక్కుమన్నారు. కాలేజీచదువుకోసం వచ్చిందిట ఆమె. హాస్టలులో ఉంటున్నాను అంది. తను ఫలానావారి యింట్లో గది అద్దెకి తీసుకొన్నాను అన్నాడు వెంకట్రావు. ఏడ్నర్థానికి కలుసుకున్న వాళ్ల ఆనందానికి అవధి లేదు. పార్వతి కొన్నాళ్లపాటు ఆవూళ్లో స్థిరంగా వుంటుం దని తెలుసుకుని వెంకట్రావు కొండ అందుకున్నాడు. ఆ రోజునుంచీ పార్వతికి తండ్రిలేని లోటే అవుపించలేదు. పాఠాలు మొదలుకుని పట్టుచీరెలవరకూ అన్నీ అతను ఓకంట కనిపెడుతూవుండేవాడు. నిజమే. తోబుట్టువులు లేనివాళ్లకి గాని అర్థంకాదు ఆ ఆరాటం!

చెల్లెలికి ముద్దూ ముచ్చటా తీర్చడంలో తల్లికి పంపవలసిన సొమ్ము అప్పటప్పట వెనకపడుతూ వుండేది. "ఉఁహూ. ఆ పల్లెటూళ్లో అమ్మకి కర్చేమిటి?" అనుకుని సమాధానపడేవాడు. ఆ మాటల్లో నిజం లేక

పోనూలేదు. అయితే, యీసారి గత రెణ్ణెల్లనుంచీ యింటికి ఎఱ్ఱని ఏగానీ పంపలేకపోయేడు. క్రిందటి నెలలో పార్వతి పుట్టినదినం వచ్చింది. పంపుదాం అనుకున్న ముప్ఫైరూపాయిలూ పట్టుచీరకి ఖరి పోయేయి. ఈ నెలలో ఏవో పుస్తకాలూ, నోట్సూ మింగేసేయి ఆ నాలుగురాళ్లూను. పోనీలే అనుకున్నాడు అతను.

తల్లి మాత్రం అంత చులాగ్గా పోనివ్వలేదు. గత పదిరోజులబట్టీ కరణంగారి యింటికి వెళ్లి చీటు పోస్టుమేనుగురించి వాకబుచేస్తూనే ఉంది. వాడూ చీటుప్రకారం బుధవారం, శనివారం వచ్చేడు; కరణంగారి యింట తిని, ఎంగిలిపట్టు అలికి వెళ్లిపోయేడు. వచ్చిన రెండుసార్లకీ యిచ్చింది ఒక్క వారపత్రిక మాత్రమే.

"తపాలావాడు కాని తినేసేడా" అని అనుమానించింది అనుభవజ్ఞ. "సుబ్బు పేకెయ్యడూ, సూరన్నగారూ" అని అంతలో సమాధానపడింది. తన కొడుకు దూబరాకర్చు పెడతాడంటే కలలోనూ నమ్మదు ఆమె. నమ్మలేదు. మరి రెండునెలల నుంచీ యీ నాగా లేమిటి చెప్మా? ఉత్తరముక్కా లేదు. ఇంకోనాడు రాసేడా ఏమిటి? అయినా అదో అర్థణాదండుగ ఎందుకూ.? కొంపదీసి, వొంట్లో ఏమైనా నజ్జుగా వుందా? ఛీ! అవాచ్యపుమాటలు అనకోకూడదు. ఆలోచిస్తూ వట్టింటి గడపలో కూర్చుంది ఆమె, వీభూతిపండూ వొత్తులబుట్టా దగ్గిరెట్టుకుని. "బుధవారానికి బుధవారం ఎనిమిది, లక్ష్మివారం తొమ్మిది, శుక్రవారం పది..."సొమ్ము రావలసిన వ్యవధి మించిపోయి ఎన్నాళ్లయిందో లెక్కపెట్టుకుంటోంది.

"ఏమమ్మోయ్, జ్ఞాపకం ఉన్నానా?" అంతలో వచ్చింది వీథిగుమ్మంలోంచి పలకరింపు.

"ఓహోహూ! వెంకన్నబుగతా! రావయ్యా, రా. అలాగ ఆ బల్లమంచంమీద కూర్చో. ఈమధ్య కాశీరామేశ్వరాలు పట్టిపోయావుటగా? ఊఁ, ఏమిటి విశేషాలు?"

"ఏమున్నాయీ?"

"అన్నట్టు మావాణ్ణి చూసేవా? నీ కసలు జ్ఞాపకంకూడా ఉండి యేడుస్తుందా యేమిటిలే. ఊళ్లోకి వచ్చేక యిహ బావుండదని ఓసారి పలకరించిపోదాం అని వచ్చివుంటావు. అవునా?"

"ఆచ్చే. చూడకేం? మీవాణ్ణి కలుసుకున్నాను."

"ఊఁ"

"నెమ్మదిగానే ఉన్నాడు."

"అంతే!"

"ఏమీలేదు. బాగానే ఉన్నాడు అంట."

పొడిగా వెకిలినవ్వు నవ్వేడు వెంకన్నబుగత. ఆమెకి ఆ నవ్వు వికృతంగా కనిపించింది. అయినా యింకేమయినా వివరిస్తాడేమో నని ఓనిమిషం వస్తాయించింది. బుగత మరి మాటలేకుండా మొలనుంచి పొడుంకాయ తీసి ఎడమచేతిలో రాల్చుకున్నాడు, ఓచిట్టెడు పట్టు. ఆమె యింక పట్టలేకపోయింది.

"భోగట్టా చెప్పమంటే అలా నీళ్లు నములుతూ కూర్చుంటా వేమిటయ్యా!"నిలవదీసి అడిగింది. దాంతో చెబుదామా వద్దా అనుకుంటూన్న బుగత ఒక నిర్ధారణకి వచ్చేసి—"చెబుతున్నాను కదూ" అన్నాడు. అంతలో ఏదో గొంతుకకి అడ్డుపడినట్టయి మరి మాట రాలేదు అతనికి. కాస్త చిన్నగా దగ్గి, గొంతుక సవరించుకొని, "అయితే ఒకటి అయివుంటుంది లెండి" అని తమ్మందంగా ఆరంభించేడు.

"ఏమిటయ్యా అయేది ఒకటే రెండూనూ. పోనీ నెమ్మదిగా ఉన్నాడా, మూలుగూ ముక్కిరింతా లేకుండానూ?"

"ఆరోగ్యంగానే వున్నాడు, దానికేం?... అంహాఁ, ప్రయివేట్లు చెబుతూఉంటేనూ, పాపం, ఆ కంపెనీలో యిచ్చిన జీతపురాళ్లు ఆటే రావడం లేదు కాబోలు అనుకున్నాను."

"నీకు తెలియనిది ఏముంది చెప్పూ, వెంకన్న మామా? పిడికిలి మూసివుంచివంతసేపే...అక్కడ వాడూ, యిక్కడ నేనూ, కుంభాలు వెళ్ళాలా? పాపం, ఏమి కష్టపడిపోతున్నాడో, వెర్రిబాగులవాడు!"

"కష్టం ఫలిస్తానన్నట్టే వుందిలేవమ్మా" వెంకన్న బుగత శ్లేషించేడు. ఆమెకి బోధపళ్లేదు.

"ఏమో, ఏం ఫలించడమో క్రిందటినెల ఏమీ పంపలేదు. ఈనెల—యివాళ అప్పుడే యిరవై యొకటి కదూ?"

"అయితే నేం లేవమ్మా. క్రిందటినెలలోనే కదూ నిస్తులు వసూలుఅవుతా. కాకపోయినా అతని నాఖరీమీదనే ఆధారపడ్డట్టు మాట్లాడతా వేమిటీ?"

"అ దేమన్నమాట, వెంకన్నమామా...పోనీలే. అయితే,యింతకూ,ఎవరి యింట్లోనట చదువు చెప్పడం? ఊరల్లా తిరిగి ఆట్టే పొద్దుపోయిందాకా శమకలు సున్నంచేసుకోడం లేదుకదా ?"

"అతను వెళ్లనక్కరలేకుండా ఆ పిల్లే అతని బసకి వస్తూఉంటుంది."

"ఏమన్నావూ ? పిల్లా ? ఎన్నేళ్లుంటాయి ?" ఆశ్చర్యంగా అడిగింది ఆమె.

"ఏం చెప్పమన్నావమ్మా. ఈడొచ్చిన పిల్లేను. ఈ పల్లెటూరిలో వున్నందుకు మనలాంటి ఛాందస కుటుంబాలలోనైతే ముగ్గురుబిడ్డల తల్లి అవును. ఇహనోటి యెందుకూ ? ఒక్క బల్లే అడ్డు అనుకో. యిటో కుర్చీ అటో కుర్చీ వేసుకుని కూర్చుంటారు. చేతి వేళ్లు తగులుతునే వుంటాయి-పుస్తకాలూ కలాలూ అటూ యిటూ మారుతూన్నప్పుడు..."

అసలే విస్తుబోయిన ఆమెకి యీమాటతో నడ్డి చరిచినట్టయింది.

"అయ్యో, అయ్యో, నీకళ్లు వెలిసిపోను ! ఫెతేల్లని యెంతమాట అన్నావు !"

"మీ రిలా యిదవుతారని నాకు తెలుసును. కాని యేం చెయ్యనూ ? చిరకాలంనుంచీ కుటుంబాన్ని యెరిగివున్నవాణ్ణికనక, ఆదిలోనే చెబితే మంచిది అనుకున్నాను. వెళ్తొస్తాను, మరి. ఊరికే గుంజాటనపడి కుంగిపోకమ్మా ; తనే దిద్దుకుంటాడు నాలుగురోజులు పోతేను...ఏదో చిన్నతనం..."

బుగతకిర్రుచెప్పుల చప్పుడు క్రమేణా ప్రతి పుటంనుంచి దూరం అవుతూన్నకొద్దీ, ఆమెగుండెలు తీవ్రంగా కొట్టుకోసాగేయి. కళ్లు మసకలు కమ్మినట్టనిపించింది. "చెడిపోవడానికి ఎంతసేపు కావాలి? అందులోనూ దూరాభారాన ఉన్నాడు. కొత్త ఓకంట కనిపెట్టడానికి యింక పెద్దదిక్కు యెవ్వరూ లేరు కదా." తను యిలా అనుకొంటూన్నకొద్దీ యీమాటలే ఎవరో స్పష్టంగా చెవిలో చెబుతూన్నట్టు తోచింది. కంగారు హెచ్చింది.

ఆ సాయంకాలం యింక ఆమె ఫలహారం చెయ్యలేదు. చీడీమీది బల్లమంచం నడివాకిట్లోకి యీడ్చుకుని నడుము వాల్చింది. కొంజా గుమ్మంతలుపు గడియ వేస్తూఉంటే కిష్టుకరణాల కుర్రాడు కనిపించేడు, సినీమాపాట పాడుకుంటూను. ఆవిడఒళ్లు ఝల్లుమంది, వాణ్ణి చూసేసరికి. ఔను మరి. అవూళ్లో అందరికీ తెలుసును, వాడు సినీమాలు మరిగి చెడిపోయినాడని. చివరికి ఆ చెడిపెముండ—కిరస్తానీ మేష్టరుకూతుర్ని—కూడా తీసుకొచ్చి దగ్గిర పెట్టుకున్నాడు. ఔలే! మూడుమైళ్లదూరంలోకాని సినీమాల్లేని ఆ పల్లెటూళ్లే అలా తగులడితే, వీధికి మూడుసినిమాలుంటే పట్నాల సంగతి వేరే అడగాలా ?

ఆమెమనసు గాలిపడగలాగా ఎగురుతోంది. కన్ను మూసుకున్నా కునుకు రావడం లేదు. ఏదో చెప్ప రాని దిగులూ. మనసుకి ధైర్యం చెప్పుకోడానికి కాబోలు "ధర్మరాజు జూదం" పాడడం ఆరంభించింది :

"అలికి విడిచిన గడప దాటడే రాజా
మునిమాపు ముంజారు దూయడే రాజా
బియ్యమ్ము మునిపంట బట్టడే రాజా"—

అంత అలా ఆచారవ్యవహారాలు పాటించినా ఆపదలు తప్పేయి కావు. ఈరోజుల్లోనా ? అందులోనూ హోటేలులో తినేవాడికి ఆచారంకూడానా. ఏ జాతీ కులమూ లేనిదో పట్టుకువోస్తుంది భోజనం డబ్బాల్లో పెట్టి. అప్రాచ్యపుముండ ! అదుగో ఆ ముక్క అనుకునేసరికి మళ్లీ పరిపరివిధాల పోయింది పాడుమనస్సు. ఎన్నిసార్లు ప్రయత్నించినా తనకళ్ల ముందు ఒకటే దృశ్యం ప్రత్యక్షం అవుతోంది—ఓ చిన్నటేబిలూ, యివతల కుర్చీలో వెంకట్రావు, అవతల దాంట్లో అదీ—సిబ్బిలా బొట్టయినా లేకుండా మొహం, కుడిచెంపని ఎర్రటి తూరీగపిన్నీనూ, జడలో కాగితపు మల్లిపువ్వులదండ, గొరకచీపురుకట్టలాగ సగంసగం వేసుకొని వొదిలేసిన అజడకి ఓ రంగుగుడ్డ పీలికానూ !

ఏదో నెపంమీద నిమిషనిమిషానికీ చేతులు కలుస్తూన్నట్టూ, మాటలసందర్భంలో విరగబడి నవ్వుతూన్నట్టూ, ఆ కేరింతాలలో ఆచిన్నదాని జుట్టు వెంకట్రావుమొహాన్ని తాకినట్టూ, వెంకట్రావు పిల్లదానిచేతులు పుణికిపుచ్చుకుని—

అవ్వ ! ఆమె గుండెలు గొల్లుమన్నాయి. ఛళ్లున తెల్లవారింది. వెంటనే పెళ్లి చేసెయ్యాలని నిశ్చయించింది. టెల్లిగ్రాఫు యిచ్చి తెప్పించింది వెంకట్రావుని. ఆడవాళ్లు అనుకోకనేపోవాలి గాని అనుకొంటే మరి అంతరాయం అంటూ వుంటుందా ? అందులోనూ ఆమెకీ.

౨

మూడునెళ్లూ పడిపోయేయి. పదహారురోజుల పండుగా అయింది. మంగళహారతిపళ్లెం పట్టుకోడానికి మాత్రం పార్వతి నోచుకోలేదు. మరో పదిహేను రోజుల్లో అతను తిరిగి ఉద్యోగంలోకి వెళ్లిపోయేడు–మళ్ళీ ఏ మొహం పెట్టుకు చెల్లిని చూస్తానా అని లోలో తపన పడుతూను. చివరకి గుండె రాయిచేసుకుని, కచేరీకి పోతూ హాస్టలుకేసి తిప్పేడు సైకిలు. తలుపులు మూసివున్నాయి. అప్పటికి అప్పుడే అంత మందీ కాలేజీకి వెళ్లిపోయేరు.

సాయంత్రం యింటికి వొచ్చేసరికి పార్వతే వచ్చి నిరీక్షిస్తోంది, అతని రాక తెలుసుకుని. చూసీ చూడ్డంతోటే యిద్దరి కంటికొలకులూ చెమ్మగిల్లేయి. ఏవో విషయాలు చెప్పి వాపోతూ—

"చూడు, పార్వతీ, వాకెమ్మనే అయిపోయినాను. ఇంతకూ యింటిపరిస్థితులు నీకు తెలియనివి కావు కదా. చివరికి ఓ శుభలేఖకూడా..." గద్గదికతో అర్ధోక్తిలోనే ఉండిపోయింది మాట.

"ఇంతకూ నేను నోచుకోలేదు అన్నయ్యా. అసలు నువ్వు పిలిచినా వొచ్చే స్థితిలో లేను. తాతయ్యగారికి..."

"అదేమిటి? నెమ్మదిగా వున్నారా?"

"ఇప్పుడు నెమ్మదిగానే ఉన్నారు. కాని ఉపద్రవమయిన జబ్బు చేసింది. టెలిగ్రాం వస్తే వెంటనే బయలుదేరి వెళ్లేను."

"ఎంతపనీ? నాకో టెలిగ్రాం అయినా యిచ్చేవు కావేం తల్లీ?"

"ఇస్తేమట్టుకు ఆ పల్లెటిముండావూళ్లో అంది చచ్చిందా ఏమిటిలే. శుభమా అని కార్యం తలపెడితే పిడకలవేట్లాటలాగ యిదొకటీ అని దొడ్డమ్మకి కోపం రావడానిక్కాని...అసలు అన్నీ నేనే మానుకోవలసి వచ్చింది, డాక్టర్ని పిలిపించడం దగ్గిర్నుంచీన్నీ. ఇంతకూ అమ్మమ్మ తప్ప యింకెవరున్నారు చెప్పు, అన్నా, కొంపలోనూ?"

"పాపం, ఏం అవస్థ పడిపోయేవో. దొడ్డమ్మ ఏదో అనుకుంటుందని ఊరుకున్నావా, వెర్రితల్లీ. కాకి చేత కబురు పెడితే రెక్కలు కట్టుకు వాలనూ? పదహారేళ్ళయి చూస్తున్నావుకదా, నా సంగతి తెలియదుటమ్మా?"

ఇంకా ఏదో మాట్లాడుకుంటూనే వున్నారు. అంతలో పోస్టలుబంట్రోతు వొచ్చి టెలిగ్రాం ఒకటి ఆమెకిచ్చి వెళ్లిపోయేడు.

సరి. ఉన్న ఊపిరీ పోయింది. కోలుకుంటున్నారనుకున్న తాతగారు కాస్తా పరమపదించేరు.

3

అతనికి గడ్డుసమస్య పట్టుకుంది. చెల్లెలికి ఉన్న ఒక్క పెద్దదిక్కూ పోయె. తను ఆరాటపడడమే గాని భారీగా యేపనీ స్వతంత్రించి చెయ్యడానికి అవకాశం లేదు. ఇహను, చెట్టుమీది పిట్టకయినా ఆధారం అంటూ వుంటుంది కాని ఆ పిల్లకి మాత్రం అంత లేదు. మొగాడు కాదు కదా బతకలేకపోతాడా అనుకోడానికి. ఈడు వచ్చిన పిల్ల. ప్రాజ్ఞత కలిగిందీ; చదువుకుంటూన్నదీని. పోనీ అని ఆమెకి ఏదైనా స్వతంత్ర జీవనోపాధి కల్పిద్దాం అంటే, తనది బొత్తిగా హీన కులమూ కాదు; అలాగని ఏమంత గొప్ప కుటుంబమూ కాదు. మొదటి తరగతివాళ్లు చేసిన పనులు ప్రపంచపు దృష్టిలో లెఖ్ఖకి రావు. ఇంక రెండవ తరగతి వాళ్లా! వాళ్లు యేం చేసినా మా బాగే. అసలు వాళ్లు యేమి చేస్తే అదే ఆదర్శం అయికూర్చుంటుంది. ఎటొచ్చీ, మధ్యతరగతివాళ్లకే యిబ్బందులు! ఉన్న వొరవళ్లకి తలవెంట్రుకవాసి వారా అనుపిస్తే, ముక్కున వేలెట్టుకుని కనిబొమ్మలు ముడివేసి చూస్తుంది లోకం. ఈసడిస్తుంది. ఛీ అనేస్తుంది. వెలిపెడుతుంది. అందులోనూ తనశాఖలో బొత్తిగా నేను!

ఎన్నివిధాల చూసినా పెళ్లి చేసెయ్యడమే మంచిదిగా అవుపించింది. కాని అదిమాత్రం అంత సులువుగా అయ్యేపనా? కాస్త డొక్కశుద్ధి ఉన్నవాడు కట్నాలు కక్కమంటాడు. ఎలాగో సరిపుచ్చుకుందాం అని వెతికితే దొరికేవాడు ఏ పౌరోహిత్యుడికొడుకోను! అన్నా, యేం చిక్కు వచ్చిపడింది!

పదిహేనురోజులు బుర్ర చించుకున్నా దారీ తెన్నూ ఏమీ కనిపించలేదు. చివరికి, కాగల కార్యం గంధర్వులే తీరుస్తారు; చదివించడమే ఉత్తమం అనుకున్నాడు. అయితే చెల్లెలు బి. ఏ. దాకా చదవాలి అంటే ప్రస్తుతం తెస్తూన్న జీతపురాళ్లు చాలవు. ఏం దారా అనుకుంటూంటే మిలిటరీవాళ్ల ఆఫీసు కనపడింది. నాలుగుసంగతులూ అడిగి తెలుసుకుని అందులో చేరిపోయేడు. జరుగుబాటు బాగానే వున్నట్టు తోచింది ఆదిలో. కాని పట్టుమని పదినెలలయినా

తిరక్కుండా పయిదేశాలకి పోవలసివచ్చింది. తల అమ్ముకున్నాక తప్పుతుందా?

౪

అయిదేళ్లు విదేశపర్యటనం చేసి చివరకి తన దేశం చేరుకున్నాడు వెంకట్రావు. మూడురోజులయి అదే ప్రయాణం స్వగ్రామానికి. వేసవికాలమేమో, విపరీతమయిన ఎండా, గాడుపూను. ఎన్ని లైంజూసులు తాగినా నాలిక యెండిపోవడమే! ప్రక్కనున్న ఆయన్ని అడిగి కూజాలో నీళ్లు తాగేడు. దాంతో పరిచయం ఏర్పడి మాటలు ఆరంభం అయినాయి, యిద్దరికీని. ఆయనా తన ఊరివాడే నట. రానురాను ఊరిభోగట్టాలలోకి దిగిపోయింది బాతాఖానీ.

"పోనిస్తురూ! రత్నంలాంటి పిల్ల, అగ్నిహోత్రంవంటి మనిషీని"—

వెంకట్రావు తదేకధ్యానంతో వింటున్నాడు, ఎప్పటికయినా ఆ ఉదంతంతాలూకు ఆచోకీ దొరుకుతుందేమో నని. అవతల ఆయన రేడియోవార్తలలాగ చెప్పుకుపోతున్నాడు.

"రామరామ! ఆమె ఇంటరో ఏదో ప్యాసయిందిట కూడాను. అలాంటి దాన్ని యింట్లో పెట్టి బయట తాళం వేసుకుపోతాడు...అదికాదు, అంత అనుమానపు మనిషి యెందుకు చేసుకోవాలీ అంట...రెండో పెళ్లి కూడా కదా...అర్దికి ఉన్నవాళ్లం మేం చస్తున్నాం ఆ యిల్లాలిపాట్లు చూడలేక..."

"ఆయనపే రేమిటి అన్నారూ?"

ఏదో చెప్పేడు. వెంకట్రావుకి తెలియలేదు.

"ఆఁహాఁ, అలాగ చూస్తా రేమిటి? ఇదివరకు ఆ కంపెనీలో హెడ్గుమాస్తాగా ఉండేవాడు-రావుగారని, యెరగరూ?"

తన పేరే ఉటంకించేసరికి గతుక్కుమన్నాడు వెంకట్రావు. అంతలో సర్దుకుని—"తెలియకేం? అయిదేళ్లయింది కాదూ అతనా వుద్యోగం మానేసి?" అన్నాడు గంభీరంగాను.

"మరేం, అతని పినతండ్రి కూతురేనట. అన్నయ్యే ఉంటే అంత అన్యాయం జరక్కపోను అని ఆఅమ్మాయి అహర్నిశలూ వాపోతూవుంటుంది."

అలాగ ఆయన కొఱతే భర్తీచేసేసరికి చెంప ఛెళ్లుమన్నట్టు అనిపించింది వెంకట్రావుకి. త్రుళ్లిపడ్డట్టు రైలు ఆగింది. "దువ్వాడా" అని నిద్రమత్తుగా పోర్టరు కేక వినపడింది. ఇద్దరూ ఆహాళంగా దిగిపోయారు. సామాను కూలీనెత్తిన యెక్కించుకుని అలా వెళుతూ ఉంటే ఎవరో ఒకామె పక్కనించే వెళ్లినట్టయింది. నాలుగుగజాలు ముందుకు సాగి వెనక్కి తిరిగి చూచిందేమోకూడాను. వెంకట్రావూ చూచేడు అప్రయత్నంగాను. ఎవరో. గేటువద్గిర టిక్కట్టు యిచ్చేస్తూఉంటే ఎవరు చెప్మా అనిపించింది మళ్లీని. ఎరిగివున్న మొహంలాగే తట్టింది. కూడావున్న ఆయన్ని సామాను చూస్తూఉండమని చెప్పి ప్లేటుఫారంమీదకి వచ్చేసరికి —సరి, రైలు కదిలిపోయింది. దూరంగా యింజనుకి పక్కపెట్టెకిటికీలోంచి ఆమెకళ్లు ఎవరినో వెతుక్కుంటూన్నట్టు అవుపించేయి. పోలిక అనిందో. లేదో స్టేషను శూన్యం అయిపోయింది.

చెల్లి! చెల్లే. ఇంకా అనుమానం ఎందుకూ? ఎంతెలాగ అయిపోయిందీ కంపలాగ! తనూ మారిపోయేవుంటాడు; లేకపోతే దిక్కుమాలిన కాకిగుడ్డలలో స్వస్వరూపం అణగారిపోయి అయినా వుండాలి. ఇందాకా వెనక్కి తిరిగిచూసింది కదూ! అన్నయ్య అవునా కాదా అని ఆమెకీ సందేహం కలిగివుంటుంది. పాపం! రెయిల్లో ఎక్కి దూరదూరంగా పోతూఉన్నా తన మూర్తినే ఎదరగా, దగ్గిరగా చూసుకుంటూ ఉంటుంది. సన్నిధికి వచ్చి ఉండీకూడా సవ్యంగా నోరారా పలకరించే యోగ్యత లేకపోయింది. వెధవ అనుమానం, మోహమాటమున్నూ. నాలికచివరికి వచ్చింది మాట. అప్పుడే "పార్వతీ" అనేస్తే తీరిపోను! గుండెల్లో ఆరాటం గొంతుకదాకా వచ్చీ కూడా వచోరూపం ధరించిందికాదు. ఎంత పొరపాటు జరిగిపోయిందీ? ఏవూరు వెళుతోందో! మళ్లీ ఎప్పుడో కలుసుకోవడం. కాకపోయినా తన అత్తవారి ఊరు ఆమె యెందుకు వచ్చింది చెప్మా!

౫

అరనిమిషంలో అమాంతంగా ఆకాశం కూలి తన నెత్తినే పడినట్టనిపించింది వెంకట్రావుకి. క్షణంలో ఆవరించుకుపోయిన కంగారు కప్పిపుచ్చుకుందాం అని ఎంత కష్టపడి యత్నించినా, కత్తి వేస్తే నెత్తురు లేకుండా నిర్వర్ణం అయిపోయింది మొహం. కూడా ఉన్న మిత్రుడుమాత్రం కులాసాగా కబుర్లు చెలుతూనే ఉన్నాడు. జట్కా సాగిపోతూనేఉంది. జట్కా ఒకలెఖ్ఖా, రెయిలే యెగిరిపోయింది రెండునిమిషాల

క్రితం రెక్కలు కట్టుకుని. ఎండలకి బీటలువారిన పొలాలని ఆనుకొని, ఒక్కటి ఒక్కటిగా మలుపులు తిరుగుతూ రోడ్డమ్మటే జట్కా సాగిపోతూన్నా, వెంకట్రావుదృష్టిలోమాత్రం ఆ రెయిలే—అప్పుడే ఆగినట్టు కాస్సేపూ, బరువుగా ముందుకి సాగిపోతూన్నట్టు మరికాస్సేపూ, అంతలోకే తనని ఆఖరిసారిగా చూద్దాం అని రెక్కలు వాల్చలేదన్న నెపంమీద నిలుచుండిపోయినట్టు మరికొంతసేపూ—అలాగ అవుపిస్తూనేవుంది. దానిమీదే మనస్సు పూర్తిగా లగ్నం అయివుండేమో, మొదట కలిగిన ఒక చిన్న భావానికి ఓ చిలవా, ఆ చిలవకి ఓ పలవా అలా అలా అల్లుకుపోయినాయి; తన గుండెల్లోనే తన కో ప్రపంచం ఏర్పడి అందులో కొందరు మనుషులూ, కొన్ని పరిస్థితులూ ఏమిటో ఏమిటో గోచరింపసాగేయి. వాటిలోనే జీవించసాగేడు అతను. భౌతికంగా చూస్తే అతను జట్కాఎక్కి ఒక ఊళ్లో వెళుతున్నాడన్నమాటే గాని, నిజం చెప్పవలసివస్తేమాత్రం అతను అక్కడ తప్ప యింకెక్కడయినా వున్నాడు, జట్కాతోటీ అందులో ఉన్న ఆ మిత్రుడితోటీ సంబంధం లేకుండాను. వాగుడుకాయలాగ మాట్లాడుతూన్నవాడు అకస్మాత్తుగా మౌనవ్రతం పట్టేసరికి, ప్రక్కని ఉన్నాయన మందలించేడు "ఏమండోయ్ రేడియోస్విచ్ ఆఫ్ చేసేసేరు?" అని. తను తూష్ణీంభావం వహించేడని ప్రక్కనిఉన్నాయన గమనించేడని తెలుసుకుని మరీ యిదయిపోయేడు వెంకట్రావు. ఏదో అందాం అనుకున్నాడు సర్దుబాటుగాను; కాని కడుపులో పుట్టిన మాట గొంతుకలోనే చచ్చిపోయింది. ఓ నవ్వు నవ్వేసి కానిచ్చేద్దాం అనుకున్నాడు. పళ్లు యికిలించినా నవ్వుమాత్రం అయింది కాదది. అంతలో యిల్లు చేరుకోవడం, నలుగురిలోనూ పడిపోవడమూ జరిగిపోయినాయి.

తన కడుపులో ఊహలనిబట్టీ ఏవో సంగతిసందర్భాలు తనకి గోచరిస్తాయేకాని, పయివాళ్లకి తెలుస్తాయా? ఇంట్లోవాళ్లు మామూలుగానే పలకరించేరు, మాట్లాడేరు. తన అంతఃకల్లోలం వాళ్లకి తెలియకుండావుండాలనీ, వాళ్లు ఎప్పటిలాగ మెసులుకోవాలనీ ప్రయత్నమూ చేసేడు వెంకట్రావు. మెదడులో జనించే గభీరఆలోచనాతరంగాలవల్ల హృన్మానిక డోలాయమానం అయేటప్పుడు కలిగే పరిస్థితే అంత. జనసమూహంలో జీవి సంచలిస్తూన్నట్టే అవుపిస్తూ, సాధ్యమైనంతవరకూ తనమట్టుకు తాను ఒంటరిగా ఉండాలని యత్నిస్తుంది. అప్పుడు—ఏకాకిగా వుండే ఆ సమయంలోకాని, క్షుభితహృదయానికి శాంతి కలగదు.

తనకి తనే మిగిలిపోతాడు వెంకట్రావు. ఎంతసేపూ ఇంకొకరి జోలి లేకుండా తాను ఒక్కడే ఉండాలి అనిపిస్తోంది అతనికి. ఇరుగూ పొరుగూ ఎవరైనా పలకరించడానికి వస్తే, వెళ్లినప్పట్నుంచి చూస్తున్నారుగదా, ఎందుకు యిలాగ చుట్టేసేస్తారు చెప్మా అని విసుగే పుడుతోందికాని, కలకాలానికి కంటపడ్డాడని చూడవొస్తున్నారనిపించడంలేదు. అదో జబ్బు. పిచ్చిలాంటిది. మామూలుగా మాటలూ చేష్టలూ ఎలాగఉన్నా, ఒంటరిగా ఉందాం అన్న యత్నమూ, అలాగ ఉండడమూ పిచ్చితరగతిలోవే. అందుకే ఆ లక్షణాలు పదిమంది దృష్టినీ ఆకర్షిస్తాయి. పట్టి అప్పచెప్పేస్తాయి. వెంకట్రావూ అలాగే దొరికిపోయేడు.

"ఏమర్రా, అల్లుడు రాలేదూ యింకానూ?" అన్నారు మామగారు, పెట్టెని విప్పడానికి వెళుతూను.

"బావ కనిపించేర్రా తమ్ముడూ" అని కూతురు ప్రశ్నించింది, బాగా పొద్దుపోయి వొచ్చినా తమ్ముణ్ణి మందలించడం మానేసి. రాత్రి భోజనాల దగ్గిరా, తదనంతరంకూడా వెంకట్రావునోటమ్మట మాటలు ముడిగానే వచ్చేయి. ఇల్లాలు యింటిపనులు చక్కబెట్టుకుని వచ్చేసరికి, తను అవతలపక్కకి వొత్తిగిలి పడుకున్నాడు.

"తమలపాకులు వేసుకోరూ?"

... ...

"పాదాలు వొత్తనా?"

... ...

"ఎడంచెబ్బ తీసేసేరు, పాపం!"

ఆమె ఒక్కర్తే మాట్లాడింది.

మర్నాడు ఓ పెద్దమనిషి "అల్లుడుగారొచ్చేరుటగా" అంటూ పలకరించేడు మామని.

"ఇప్పుడే వెళ్లేరండీ, ఎటోను" అనక తప్పింది కాదు ఆయనకి. అప్పటికప్పుడే మూడు కేంపులయినా వెళ్లొచ్చేడు, వెంకట్రావు—చుట్టుపట్ల తన బంధువులు ఉన్న ఊళ్లన్నీ జ్ఞాపకంటూ చేసుకుంటు. చెల్లెలిఅచోకి మాత్రం అందకుండా వుంది. ఎక్కడికి వెళు

తున్నాడో ఏమిటో! సూర్యోదయాన్ని కనిపించిన మనిషి మళ్ళీ అర్ధరాత్రిదాకా అవుపించకుండా పోతున్నాడు. "కాలుగాలిన పిల్లి. ఏమిటో యీ వాటం?" అని అనుమానాలు బయలుదేరక పోలేదు శ్వశుర గృహంలోను. మరో రెండురోజులకి ఊరే గుప్పుమని పోయింది పుకార్లతోటి. వెంకట్రావు అప్పటికి రెయి లెక్క రెండురోజుల మధ్యాహ్నం అయింది. వెళ్లి నప్పుడు ఎవ్వరితో చెప్పనూలేదు. భార్యమాత్రం అడిగింది—

"ప్రయాణ మేమిటి?" అని.

"ఆఁ, సెలవు అయిపోవచ్చింది."

౬

"అప్పుడే వెళ్లిపోయేట్టా?" అన్నారు అమ్మలక్కలు.

"ఎంతండీ! పెళ్లాళ్లు సెలవ అన్నమాటేగాని యిట్టే తిరిగిపోతాయి రోజులు" అంది వెంకట్రావు భార్య, సమానభావం మూర్తీభవించినట్టు.

"ఎంచక్కా అన్నావే తల్లీ! ఇంకా నిన్నగాక మొన్న బండీలోంచి దిగుతూన్నట్టు మాకే అనిపిస్తూ ఉంటేనూ?" అంది ఓ అచ్చుక్క.

"మరేం. చేతిలో యీగని తీసి పారేసినట్టు ఎలాగ ఆపేసిందో! అయినా యిప్పటి కాలపువాళ్లకి మొగుడంటే బొత్తిగా చీమకుట్టను లెక్కా!" అంది మరో బుచ్చుక్క.

ఇంకో నాలుగురోజులు పోయేసరికి ఆమె జాతకం చూపించడంకూడా అయింది. ఊళ్లో వున్న పుకారు స్థిరమయిన భోగట్టా అయి ఊరుకుంది.

"వాళ్ల అమ్మాయిని తీసుకువెళుతున్నాట్టగా, పెనిమిటీ?" అన్నాడు ఒకాయన, ఓనాటి ఉదయాన్నే చెఱువుగట్టున మొహం కడుక్కుంటూ, గడ్డు తేలేసి నాలిక సగం తెగేలాగ గీస్తూనే.

"విఘ్నేశ్వరుడు పెళ్ళికి వెయ్యివిఘ్నాలు! ఈ వూరినుంచి అమ్మాయిని యెక్కించుకుని బండీ కదలాలి, అప్పుడు అనుకోవాలి"

యింకో ఆయన సమాధానం చెప్పేసు.

"అహాఁ, పట్నంలో యిల్లు కుదిరిందిటగనూ?"

"తీసుకువెళ్లా లని ఉంటే యిన్నాళ్లా యిల్లే కుదరకపోయిందీ! అసలు పెళ్లాన్ని వొదిలేసినవాడికి యిల్లెందుకూ అంట!" కంఠంలోతు నీళ్లలో నుంచుని జపం చేసుకుంటూన్న సిద్ధాంతి యీమాట కాస్తా అనేసి, సగంలో ఆపేసిన జపం తిరిగీ ఆరంభించేడు.

"ఉదీచ్యై దిశే యాశ్చ దేవతాః యాః సంతి తే..."